# సత్యవాక్కు

సంపుటి - 41 సెప్టెంబర్ - 2019 సంచిక - 2

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

SEPTEMBER - 2019

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోవీ గూటం |

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్యం

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

**సంపుటి - 41** **సెప్టెంబరు- 2019** **సంచిక -2**


## యేసు ఏల అవతరించెను ?

### (Why did Jesus Come ? )

యోహాను సువార్త మొదటి అధ్యాయములో యిట్లు వ్రాయబడి యున్నది :"ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవునియొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగి యున్న దేదియు ఆయన లేకుండ కలుగలేదు." "ఆ వాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను; తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమ వలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" (యోహాను 1:1–3, 14).

సజీవుడైన దేవుని కుమారుడగు యేసుక్రీస్తు ఈలోకములో నరుని వలె అవతరించుటకంటె మరొక గొప్ప సంఘటన లేనేలేదు. ఆయన రాక ఎంత ప్రాముఖ్యమైనదంటే ఈభూలోక చరిత్ర అంతయును ఆయన రాకను బట్టి గణించబడుచున్నది. చరిత్ర అంతయును క్రీస్తుకు పూర్వమనిగాని లేక క్రీస్తు తరువాత అనిగాని లెక్కింప బడుచున్నది. మానవచరిత్ర నంతటిని మార్చినవాడు యేసుక్రీస్తు. నేను దేవుడను, దేవుని కుమారుడను యని

ఆయన తనను గూర్చి చెప్పుకొనుటయే గాక, ఆ మాటలను నిరూపించెను. ఆయన సిలువపై చనిపోయెను, సమాధి చేయబడెను. మూడవదినమున సజీవుడై తిరిగి లేచెను. తన ఆత్మీయ రాజ్యమగు సంఘమును గొప్ప బలముతో స్థాపించెను. అయితే ఈ రోజు యేసుక్రీస్తు ఈ భూమిపై ఏల అవతరించెనో తెలిసికొందము :

యేసుక్రీస్తు ఈభూమిపై యున్న కొద్ది కాలములో ఆయన అవతారము నకు కనీసము నాలుగు కారణములు మనకు కనిపించుచున్నవి. అవి : 1) ఆయన తండ్రియైన దేవుని బయలు పరుచుటకు వచ్చెను. 2) పాపులను రక్షించుటకును, పాపమును నాశనము చేయుటకును ఆయన వచ్చెను. 3) ఆయన అపవాది యొక్క క్రియలను నాశనము చేయుటకు వచ్చెను. 4) భూమి పై దేవుని రాజ్యమును స్థాపించుటకు వచ్చెను. వ్యక్తిగతముగా గాని, సాంఘికముగా గాని, జాతీయముగా గాని ఏమైతే దేవుని చిత్తమునకు విరుద్ధముగా యున్నదో దానినంతటితోను యేసుక్రీస్తు వైరమును కలిగి యుండెను.

దేవుని బయలు పరచెను :

తండ్రియైన దేవుని బయలు పరచుటయే ఆయన ఉద్దేశ్యమని క్రీస్తు ప్రకటించెను. 'ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్మున నున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలు పరచెను అని ఆయన చెప్పెను (యోహాను 1:18). ఆయన శిష్యులలో ఒకడగు ఫిలిప్పు "ప్రభువా, తండ్రిని మాకు కనుబరచుము. మాకంతే చాలునని ఆయనతో చెప్పగా, యేసు ఫిలిప్పు నేనింత కాలము మీ యొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా? నన్ను చూచినవాడు తండ్రిని చూచి యున్నాడు గనుక తండ్రిని మాకు కనుపరచుమని యేల చెప్పుచున్నావు? తండ్రియందు నేనును నాయందు తండ్రియు ఉన్నా మని నీవు నమ్ముటలేదా? నేను మీతో చెప్పుచున్న మాటలు నాయంతట నేనే చెప్పుటలేదు. తండ్రి నాయందుండి నివసించుచు తన క్రియలు చేయు చున్నాడు" అని అతనితో చెప్పెను (యోహాను 14:8-12). ప్రతి మానవుని హృదయములోయున్న కోరికను ఫిలిప్పు వ్యక్తపరచెను: "తండ్రిని మాకు కనబరచుము". అయితే

నన్ను చూచినవాడు తండ్రిని చూచి యున్నాడని యేసు జవాబిచ్చెను.

పరమందున్న తండ్రిని ప్రేమలోను, దయలోను, కరుణలోను, క్రమశిక్షణ లోను, ఆజ్ఞలలోను వ్యక్తిగతముగాను యేసు తండ్రిని మానవులకు బయలు పరచెను. అందుకే దావీదు మహారాజు యిట్లు పలికెను: "తండ్రి తన కుమారు ల యెడల జాలిపడునట్లు యెహోవా తనయందు భయభక్తులుగల వారి యెడల జాలిపడును. మనము నిర్మింప బడిన రీతి ఆయనకు తెలిసే యున్నది. మనము మంటివారమని ఆయన జ్ఞాపకము చేసుకొనుచున్నాడు" (కీర్తన 103:13,14). యేసుక్రీస్తు యొక్క జీవితమును బట్టియు ఆయన బోధన లను బట్టియు మన హృదయములు ఆయనకు సమర్పించవలెను. మన చిత్తమును సంపూర్తిగా ఆయన చిత్త మునకు అప్పగించవలెను. ఏలయనగా ఆయన నరావతారమెత్తి వచ్చిన నిజ దేవుడు, దేవుని కుమారుడు.

**పాపమును నిర్మూలించెను**

యేసుక్రీస్తు పాపమును నిర్మూలించుటకును, పాపులను రక్షించుటకును ఈ లోకమునకు వచ్చెను. "పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమిం చును; ఆజ్ఞాతిక్రమమే పాపము. పాపములను తీసివేయుటకై ఆయన ప్రత్యక్షమాయెనని మీకు తెలియును. ఆయన యందు పాపమేమియు లేదు" అని భక్తుడైన యోహాను వ్రాసెను (1 యోహాను 3:4,5). తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అని పేరు పెట్టబడెను (మత్తయి 1:21). బాప్తిస్మ మిచ్చు యోహాను యేసు తన యొద్దకు రాగా చూచి–ఇదిగో లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లయని ఆయనను పరిచయము చేసెను (యోహాను 1:29).

పాపములలో నశించిన వారిని వెదకి రక్షించుటకు తాను వచ్చెనని ఆయన ప్రకటించెను (లూకా 19:10). ఈలోకములో యుండగా ఆయన పాపులతో సహ వాసము చేసెను. వారిపై జాలి గొనెను. వారి పాపములను క్షమించెను. మరియు ఈలోక పాపములనన్నిటిని తన సిలువపై మోసి తన్ను తాను పాప

ప్రాయశ్చిత్తార్థబలిగా అర్పించుకొనెను. అనేకుల పాపక్షమాపణ నిమిత్తము సిలువపై తన రక్తమును చిందించెను. "ఎందుకనగా మన మాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" (2 కొరింథీ 5:21). అందుకే "ఆయన యుగముల సమాప్తియందు తన్ను తానే బలిగా అర్పించుకొనుట వలన పాపనివారణ చేయుటకై ఒక్కసారే ప్రత్యక్షపరచబడెను" (హెబ్రీ 9:26). ఇప్పుడు యేసుక్రీస్తు నందు విశ్వసించి ఆయన నామమందు బాప్తిస్మము పొందు వారి పాపములను ఆయన తీసివేయును (మార్కు 16:16; అపొ.కా. 22:16).

**అపవాది క్రియలు :**

యేసుక్రీస్తు అపవాది క్రియలను నాశనము చేయుటకు వచ్చెను. "అపవాది మొదటి నుండి పాపము చేయుచున్నాడు గనుక పాపము చేయువాడు అపవాది సంబంధి. అపవాది యొక్క క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను" అని 1 యోహాను 3:8 చెప్పుచున్నది. అయితే అపవాది చేయుపనులేమిటి? సాతాను డు మానవులను దేవుని నుండి దూరముగా చేయును, వారిని పాడుచేయును. ఈలోకములో దేవుని చిత్తమునకు భంగము కలిగించుటకు ప్రయత్నించును. మరియు ప్రతివానిని మరణ బంధకము లలో యుంచును. ఇవి, అపవాది చేయు క్రియలు. యేసు వాటిని లయము చేయుటకు నరావతారిగా వచ్చెను.

**అపవాది క్రియల లయము:**

అపవాది క్రియలను యేసుక్రీస్తు యెట్లు లయముచేసెను? ఆయన తానే మరణమును జయించి దాని ముల్లును విరిచెను. మానవులకు నిత్యజీవము నిచ్చుటద్వారా ఆయన మరణమును లయము చేసెను (యోహాను 10:10). అందుకే క్రీస్తునందు విశ్వాసముంచు వారికి మరణభయములేదు. వారొక వేళ మరణించినను తిరిగిలేతురు గనుక మరణభీతిని యేసుక్రీస్తు తొలగించెను. ఆయన ఈలోకమునకు వెలుగై వచ్చినందున అపవాది యొక్క చీకటిని, చీకటిక్రియలను లయము చేసెను. అందుకే "నాయందు విశ్వాసముంచు ప్రతివాడు చీకటిలో నిలిచి యుండకుండునట్లు నేను ఈలోకము

నకు వెలుగుగా వచ్చియున్నానని" ఆయన బోధించెను (యోహాను 12: 42). ఆయన శత్రువులను కూడ ప్రేమించి ద్వేషమును సంహరించెను. పరిపూర్ణ క్రొత్త నిబంధనిచ్చి అరాచకత్వమును నిర్మూలించెను.

**రాజ్యస్థాపన :**

యేసుక్రీస్తు తన రాజ్యమును స్థాపించుటకు ఈలోకమునకు వచ్చెను. నా సంఘమును కట్టుదును, పాతాళ లోకద్వారములు దానియెదుట నిలువ నేరవని ఆయన చెప్పెను (మత్తయి 16: 18). ఆయన సంఘమే ఆయన రాజ్యము. ఆయన రాజ్యము ఈలోక సంబంధమైనది కాదు (యోహాను 18:36). అది ఆత్మీయమైనది. ఎక్కడయితే ప్రజలు యేసును నమ్మి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, బాప్తిస్మము పొందుదురో వారే ఆయన రాజ్యమై యున్నారు. యేసు వారి రాజై యున్నాడు. ఆయన యిచ్చిన క్రొత్త నిబంధన ఆయన చట్టమైయున్నది. కొలస్సయిలోని క్రైస్తవులకు అపొ.పౌలు యిట్లు వ్రాసెను: "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్యనివాసులనుగా చేసెను" (కొలస్స 1:13). ఆయన రాజ్యము నిశ్చలమైనది (హెబ్రీ 12:28).

యేసుక్రీస్తు మరల రాబోవుచున్నారు. ఆయన రెండవసారి వచ్చునప్పుడు రక్షకునిగా కాదుగాని గొప్ప తీర్పరిగా రాబోవుచున్నారు. ఆయన మరల వచ్చినప్పుడు అందరికీ ఆయన తీర్పు తీర్చును. మనలో ప్రతివాడును తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైననుసరే, చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనందరము క్రీస్తున్యాయపీఠము యెదుట ప్రత్యక్షము కావలయును (2 కొరింధి 5:10). గొర్రెలలో నుండి మేకలను ఒకడు వేరుచేయునట్లు అనీతిమంతుల నుండి నీతిమంతులను ఆయన వేరు చేయును. నీతిమంతులు నిత్య జీవమునకును, అనీతిమంతులు నిత్య నరకములోనికి ప్రవేశింతురు. యేసు క్రీస్తు ఈ ఘడియలో వచ్చిన యెడల నీవు ఆయన దృష్టిలో నీతిమంతునిగా కనబడగలవా? ఇప్పుడే పరీక్షించుకో.

# రాజులకు రాజైన యేసు

## ( Jesus Christ, the King of Kings )

యేసుక్రీస్తు రాజులకు రాజును ప్రభువులకు ప్రభువైయున్నారు. క్రీస్తు తన రాజ్యమును ఇంకాస్థాపించలేదని కొందరు చెబుతారు. అయితే క్రీస్తు తన రాజ్యమును స్థాపించి తన సింహాసనాసీనుడైయున్నట్లు బైబిలు చెప్పుచున్నది.

పెంతెకొస్తు నాడు పేతురు ప్రసంగించు చు, దావీదు "ప్రవక్తయై యుండెను గనుక అతని గర్భ ఫలములో నుండి అతని సింహాసనము మీద ఒకని కూర్చుండబెట్టుదును అని దేవుడు తనతో ప్రమాణ పూర్వకముగా ఒట్టు పెట్టుకొనిన సంగతి అతడెరిగి" యుండె నని చెప్పెను (అపో.కా. 2: 30). కొలస్స యులకు పౌలు వ్రాయుచు, "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులుగా చేసెను" అని చెప్పెను (కొలస్స 1:13).

**రాజ్యమేలు క్రీస్తు :**

క్రీస్తు రాజుగా రాజ్యమేలు చున్నారని ప్రవక్తలు ప్రకటించారు. ఆయన పరలోకమున కారోహణ మైనప్పుడు ఈ వాగ్దానమును నెరవేర్చెను. నిత్య రాజ్యస్థాపనను గూర్చి దానియేలు గ్రంధములో ఆయన ఇట్లు ప్రకటించారు. "ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యమును స్థాపించును. దానికెన్నటికి నాశనము కలుగదు. ఆ రాజ్యము దాని పొందిన వారికే గాక మరెవరికిని చెందదు, అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని వగులగొట్టి నిర్మూలము చేయునుగాని అది యుగ యుగములు నిలుచును" (దానియేలు 2:44). రాజైన నెబుకద్నెజరు కల యొక్క భావార్థమును చెబుతు దానియేలు పై మాటలు పలికెను. నెబుకద్నెజరు కలలో చూచిన రాజ్యములేవనగా బబులోను, మాదీయ, పారశీక రాజ్యము,

గ్రీకుసామ్రాజ్యము మరియు రోమా సామ్రాజ్యము.

మానవులకు అనుగ్రహించబడు రాజును గూర్చి యెషయా కూడ ప్రవచించాడు : "ఏలయనగా మనకు శిశువు పుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహించబడెను, ఆయన భుజము మీద రాజ్యభారముండును, ఆశ్చర్య కరుడు, ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు, నిత్యుడగుతండ్రి, సమాధాన కర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడెను. ఇది మొదలుకొని మితి లేకుండ దానికి వృద్ధియు క్షేమమును కలుగునట్లు, సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియ మించును. న్యాయము వలనను, నీతి వలనను రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్య పరిపాలన చేయును, సైన్యములకధిపతి యగు యెహోవా ఆసక్తి కలిగి దీనిని నెరవేర్చును" (యెషయా 9:6,7).

**సింహాసనము పై యున్న రాజు :**

ఆయన దావీదు సింహాసనాసీను డై యుండెనను. భావములో ఈ రాజ్యము ఆత్మీయమైనదని గ్రహించ వచ్చును (యిర్మియా 22:30). కొన్యా యొక్క సంతతిలో ఎవడును దావీదు సింహాస నము మీద యూదాలో కూర్చుండడు. యూదా గోత్రము నుండి వచ్చిన క్రీస్తు వరలోకములో (భూమిమీద కాదు) దావీదు సింహాసనము మీద కూర్చు న్నారు.

యెషయా ప్రవచించినట్లు కన్య యైన మరియ యొక కుమారుని కనెను (యెష 7:14). గాబ్రియేలుదూత మరియకు అట్లు సంభవించును గనుక ఆమె భయపడవద్దని హెచ్చరిక చేసాడు (లూకా 1:26-35). ఇదెట్లు సంభవిం చునని మరియ దూతను ప్రశ్నించగా ఆమె పరిశుద్ధాత్మావలన గర్భవతియై కుమారుని కనునని చెప్పెను (లూకా 1:35). క్రీస్తు జన్మించిన తరువాత తూర్పు దేశపు జ్ఞానులు ఆయననారాధింప వచ్చి "యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడ యున్నాడు? తూర్పుదిక్కున మేము ఆయన నక్షత్రము చూచి ఆయనను పూజింప వచ్చితిమని చెప్పిరి" (లూకా 2:2).

సాధారణంగా రాజులు గొప్ప ఆర్భాటముతో సింహాసనమునందాశీను లవుదురుగాని యేసు మాత్రము గొప్ప భౌతిక వేదనతో బాధతో దానియందు ఆసీనులయ్యారు. ఆయన మానవులకు సేవచేయుటకు పరలోకమును వీడి దాసునివలె ఈలోకానికి వచ్చారు (ఫిలిప్పీ 2:6-8). ఆయన తన పరిచర్య ప్రారంభించగా ఆయన అవమానమును, హింసను భరించ వలసి వచ్చునని ఎరుగును. అయినను మానవులయెడల ఆయనకున్న ప్రేమ ఆయనను ప్రోత్సాహించెను (హెబ్రీ 12:2).

క్రీస్తు సుఖభోగాలతో జీవించ లేదు. ఆయనకొక నివాసము కూడ లేదు. తనకు తలదాచుకొనుటకుకైనను స్థలము లేదని ఆయనే చెప్పారు (లూకా 9:58). ఆయన బోధిస్తు రోగులను స్వస్థపరుస్తు, మేలుచేయుచు ఊరూరా తిరిగారు (అపొ.కా. 10:38).

**క్రీస్తు యొక్క పట్టాభిషేకము :**

క్రీస్తుయేసు యొక్క పట్టాభిషేక మార్గము కల్వరి గుండా వెళ్లెను. మార్గములో ఆయనతో యున్నవారు ఆయనను విసర్జించారు (మత్తయి 26:56). ఒకడాయనను అప్పగించాడు, మరియొకడు ఆయననెరుగనన్నాడు. వీరాయనకొరకు సయితము చనిపోవు దుమన్నారు (యోహాను 13:37). రాజైన యేసును వారు బంధించారు, అన్యాయతీర్పు జరిగించారు; రోమా సైనికులాయనను కొరడాలతో కొట్టారు, హేళన చేసారు, ఆయన తలపై ముండ్ల కిరీటమునుంచారు, ఊదారంగు వస్త్రము ధరింపజేసారు (యోహాను 19:1-3). ఆయనను సిలువ చేసి చంపారు. అరిమతయి యోసేపు ఆయన శరీరమును తన సమాధిలో పాతిపెట్టాడు (మత్తయి 27:57-60).

ఈ రాజు మరణము జయించి లేవగానే ఆయన గొప్ప శక్తిని మనము చూడగలము (1 కొరింథి 15). ముందు అపొస్తులులును తదుపరి 500 మందికి పైగా శిష్యులును పునరుత్థానుడైన ఆయనను చూచారు.

బేతనియ నుండి క్రీస్తు తన సింహాసనమున కారోహణుడయ్యారు (లూకా 25:50-52). పరలోకము

నుండి ఆయన వారికి శక్తిని పంపు వరకు యెరూషలేములో కనిపెట్టండని క్రీస్తు వారికి హెచ్చరిక చేసెను (లూకా 24:44-49). ఈ శక్తి పెంతెకొస్తు నాడు వారిపైకి దిగివచ్చెను. ఆ రోజునే క్రీస్తు రాజని పేతురు ప్రకటించాడు.

ఈ రాజుల రాజుకు సమస్తాధికారమున్నది (మత్తయి 28:18). ఆయన చట్టమునిచ్చువాడును, న్యాయాధిపతియునై యున్నారు (యోహాను 12:48; 2 కొరింథి 5:10). క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నారు. అదే ఆయన రాజ్యము (మత్తయి 16:13-19; కొలస్స 1:18).

క్రీస్తు రాజులకు రాజైయున్నారు (1 తిమోతి 6:15). ఆయన ప్రధాన యాజకుడు కూడా. ఆయన మానవావతారియై యున్నందున మానవుని శోధనలన్నిటిని ఎరిగి యున్నారు. మానవులు పాపముతో చేయు పోరాటము నాయన ఎరిగి యున్నారు. ఆయనను వెంబడించు వారందరికీ ఆయన సహాయము చేయును. రాజులకు రాజైన యేసు మానవులందరి కొరకు తన్ను తాను బలిగా అర్పించుకొన్నారు.

- రైలీ నెల్సన్

## రక్తమా ? నీరా ?
## (Blood or Water ? )

ఎవడైనను రక్షింపబడితే వాడు క్రీస్తు రక్తము వలననే రక్షింపబడునని బైబిలు బోధించుచున్నది. "ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" అని యేసు చెప్పారు (మత్తయి 26:28). "దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనము అనగా మన అపరాధములకు క్షమాపణ కలిగి యున్నది" యని పౌలు ప్రకటించాడు (ఎఫెసీ 1:7). కొలస్స 1:14 కూడ చూడుము. "అయితే ఆయన వెలుగు

లోయున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము. అప్పుడు ఆయన కుమారుడైన యేసురక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" అని యోహాను వక్కాణించాడు (1 యోహాను 1:7). తరువాత "మనలను ప్రేమించుచు తన రక్తము వలన మన పాపములనుండి మనలను విడిపించిన వానికి మహిమయు ప్రభావమును యుగయుగములు కలుగును గాక" యని అతడు తెలియజేసాడు (ప్రకటన 1:6).

దేవుని యొక్క ఆశ్చర్యకరమైన కృపలేని యెడలన మానవజాతి అంతయు నశించును, "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై యున్నది" (తీతు 2:11). తన కుమారుని ఈ లోకమునకు పంపి మన నిమిత్తమై ఆయనను బలియిచ్చుట ద్వారా దేవుని కృప ప్రత్యక్ష పరచబడెను. "దేవుని కృప వలన ఆయన ప్రతి మనుష్యుని కొరకు మరణము అనుభవించునట్లు దూతల కంటె కొంచెము తక్కువ వానిగా చేయబడిన యేసు మరణము పొంది నందున మహిమా ప్రభావముతో కిరీటము ధరించిన వానిగా ఆయనను చూచుచున్నాము (హెబ్రీ 2:9). "చెప్ప శక్యము కాని ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రము" (2 కొరింధి 9:15).

మానవుని పాపములకు క్రీస్తు రక్తము చేర్చబడినపుడు అతడు రక్షింపబడును. దేవునితో సహవాసమేర్పడును. క్రీస్తు రక్తము పాపములను కడిగివేయగలిగిన యెడల (అది కడిగివేయును), అది అందరి కొరకు చిందింప బడిన యెడల (అందరి కొరకు చిందింపబడెను), అందరు ఎందుకు రక్షింపబడుటలేదు? (మత్తయి 7:13-14). దానికి కారణము అందరు క్రీస్తు రక్తము దరికి చేరుటలేదు.

### రక్తము దరికి చేరుకొనుట :

ప్రశ్నయేమంటే క్రీస్తురక్తము దరికి మనము ఎట్లు చేరుకొనగలము?

నిజంగా క్రీస్తు రక్తమునే కనుగొని, దానిని మన శరీరములకు పూయవలెనా? మనం అట్లు చేయగలిగిన యెడల (అట్లు చేయనేలేము), అది పాపముల నేమీ చేయలేదు. పాపము ఆత్మీయ రోగము. భౌతిక రక్తము దాని నేమీ చేయలేదు, అయితే క్రీస్తురక్తము దరికి మనము ఎట్లు చేరుకొనగలము? బైబిలు యేమి చెప్పుచున్నది?

పెంతెకొస్తునాడు యూదులు తమ పాపముల చేత ఒప్పింపబడిన వారై మేమిమి చేతుము? అని అడిగి నప్పుడు వారికి పేతురు, "మీరు మారు మనస్సుపొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" అని చెప్పెను (అపొ.కా.2:38). ఒకడు పాప క్షమా పణ ఎట్లు పొందును? అది క్రీస్తు రక్తము వలననే సాధ్యమగునని పౌలు చెప్పెను. మారుమనస్సు, బాప్తిస్మము ద్వారా అది సాధ్యమగునని పేతురు కూడ జవాబిచ్చాడు. గనుక బాప్తిస్మ ము ద్వారానే మనము క్రీస్తు రక్తము దరికి చేరుకొనగలము.

తార్సువాడైన సౌలు క్రీస్తు సంఘమును హింసించుచు యేసుక్రీస్తు ను ముఖాముఖిగా ఎదుర్కొనినప్పుడు, తన పాపనివారణకై యేమిచేయవలెనో అతనికి దమస్కు పట్టణములో తెలియ జేయబడునని చెప్పబడెను (అపొ.కా. 9:6; 22:10). సౌలు అతనికి చెప్పబడి నట్లుగానే దమస్కుకు పోయి మూడు దివారాత్రులుమట్టుకు నిద్రాహారములు లేక ప్రార్ధనలో గడుపుచుండెను. ఈలోగ క్రీస్తు అననీయకు దర్శనమిచ్చి రక్షింపబడుటకు సౌలు యేమి చేయ వలెనో అతనికి తెలియజెప్ప పలికెను. అననీయ సౌలును చూచినప్పుడు మారుమనస్సు పొందిన విశ్వాసియైన సౌలునుకనుగొనెను. రక్షింపబడవలె నంటే యేమిచేయాలో అది అతనికి తెలియజేయబడెను. "గనుక నీవు తడువు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్ధన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను

కడిగి వేసుకొనుమని" సౌలుకు చెప్పబడెను (అపొ.కా. 22:16). లేచి వెంటనే అతడు బాప్తిస్మము పొందెను.

బాప్తిస్మములో అతని పాపములు కడిగివేయబడునని సౌలుకు చెప్పబడెను. అయినను ముందు చూచినరీతిగా క్రీస్తు రక్తము మనలను పాపమునుండి విమోచించును. యిది స్వవిరుద్ధము కాదు గాని చెప్పబడిన దానిని స్థిర పరచును, క్రీస్తు రక్తము వలన పాపములు కడుగబడును. ఒకని విశ్వాసము, మారుమనస్సుతో కూడిన బాప్తిస్మము వలన అతని పాపములు కడుగబడును.

యేసురక్తము మన పాపములను ఇట్లు తొలగించును. లేఖనముల ప్రకారము ఆ రక్తము బాప్తిస్మము ద్వారా మనలను పవిత్ర పరచును. గనుక ఒకడు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడు అతడు క్రీస్తు రక్తము దరికి చేరును. పాపక్షమాపణ పొందును. అందువల ననే మారుమనస్సు పొందిన ప్రతి విశ్వాసియు క్రీస్తునామమున పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను.

**- మైకేల్ హేచర్**

## నిరుపరాధులను చంపు చేతులు

## ( Hands that shed innocent blood )

" దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మఆయెను" (ఆది.కా. 2:7). వెలుగు కలుగును గాకయని ఆయన ఎట్లు పలికారో అట్లే జీవము కలుగును గాకయని ఆయన అన్నట్లున్నది! అయినను ఈ సంఘటన జరిగిన త్వరలోనే మరణము ప్రవేశించినట్లు మనము చూడగలము (ఆది.కా. 2:16, 17). ఆదాము హవ్వలు దేవుని ఆజ్ఞను ఉల్లంఘించినప్పుడు మరణము మొదటిగా సంభవించుట మనము గమనించ

గలము (ఆది.కా. 3:22-24).

అయితే జీవముతో మరణ యుద్ధము ఇట్లు ప్రారంభించబడగా, భూమి మీద పాపమువలన మరింకొకటి, అనగా నిరపరాధ రక్తము చిందింపబడుట ప్రవేశించెను. కయీను తన తమ్ముడైన హేబెలును హత్యచేసెను (ఆది.కా. 4:8). నిజముగా నిరపరాధులను చంపుచేతులను దేవుడు అసహ్యించుకొనును (సామె 6:16-17).

## నిరపరాధులను చంపు చేతులను దేవుడు అసహ్యించుకొనును

మానవ చరిత్ర యంతటిలోను నరహత్యను దేవుడు ఖండించారు. పితరుల యుగములో దేవుడు నరహత్యను ఖండించారు (ఆది.కా. 4:11; 9:6). మోషే యుగములో దేవుడు నరహత్యను ఖండించారు (నిర్గమ 20:13). నేడు క్రొత్త నిబంధన యుగములో కూడ నరహత్యను శరీరకార్యములతో అపో.పౌలు చేర్చాడు (గలతీ 5:21). "మీలో ఎవడును నరహంతకుడుగా గాని, దొంగగాని, దుర్మార్గుడుగా గాని బాధ అనుభవింప తగదు" అని అపో. పేతురు చెప్పాడు (1 పేతురు 4:15). నిజానికి బైబిలులో ఆఖరి పుస్తకము నరహత్యను ఘోరముగా చిత్రీకరించుచున్నది (ప్రకటన 21:8).

నేటి ప్రపంచ చరిత్ర అంతయు నరహత్యతో నిండియున్నది. అమెరికా దేశములోనే ప్రతి 22 నిమిషములకు ఒక హత్య జరుగుచున్నది. నేటి లోకము అంతా ఘోర దుష్టత్వముతో నిండియున్నది.

## ఆత్మహత్యను సునాయాసన (Euthanasia) హత్యలను దేవుడు అసహ్యించుకొనును

వృద్ధాప్యమువలనను, అంగ వైకల్యము వలనను, దీర్ఘకాలవ్యాధుల వలనను తమ్మును తాము సునాయాసముగా చంపుకొనుటను (Euthanasia) దేవుడు అసహ్యించుకొనును. ఇట్టి వారు యితరులకు ఆటంకముగా యున్నారని తలచి మత్తుమందు గాని మరొకటిగాని వారికెక్కించి సునాయసముగా చంపుటను దేవుడు అసహ్యించు

కొనును. మనము దేవుని వలె నటించ రాదు. "జీవరాసుల ప్రాణమును మనుష్యులందరి ఆత్మలును ఆయన వశమున నున్నవి" (యోబు 12:10).

దేవుడు తాను సృజించిన వారి ప్రాణమును కొనసాగించును. ప్రతి మనుష్యుని జీవము ఆయన వశమున నున్నది. యితరుల ప్రాణమును గూర్చి నిర్ణయించే హక్కు మనకు లేదు. మనం ఎప్పుడు మరణించాలో నిర్ణయించే హక్కు దేవునికి మాత్రమే కలదు. ఎవరు బ్రతకాలో, ఎవరు మరణించాలో నిశ్చయించే హక్కు ఏ మానవునికి లేదు. అది దేవునికి మాత్రమే చెందును.

## భ్రూణహత్యను (Abortion) దేవుడు అసహ్యించుకొనును

పిండదశలో యున్న శిశువును గూర్చి వర్ణించుచు దావీదు పరోక్షముగా భ్రూణహత్యను (Abortion) ఖండించాడు (కీర్తన 139:13-17). తల్లి గర్భములో యున్న పిండము మాట్లాడుచున్నాడు. తానొక వ్యక్తిగా మాట్లాడుచున్నాడు. విచారం యేమంటే అమెరికా దేశములోనే నూటికి 26 మంది శిశువులను ఈ రీతిగా గర్భములో యుండగానే హత్య చేయుచున్నారు.

అబార్షన్ నరహత్యే ఏలయనగా గర్భములోయున్న శిశువు మానవుడే లేక మానవురాలే, గర్భములోయున్న పిండము జీవముగల శక్తియే. యిర్మియా తన తల్లి గర్భములో పిండముగా యున్నపుడే దేవుడతనితో ఇట్లు పలికారు: "గర్భములో నేను నిన్ను రూపింపకమునుపే నిన్నెరిగితిని, నీవు గర్భములో నుండి బయటపడక మునుపే నేను నిన్ను ప్రతిష్ఠించితిని, జనములకు ప్రవక్తగా నిన్ను నియమించితిని" (యిర్మియా 1:4,5, లూకా 1:41 కూడ చూడుము).

అబార్షన్ నరహత్యతో సమానము ఏలయనగా బైబిలులోని లోతైన సూత్రమును, బంగారు సూత్రమును అది ఉల్లంఘించు చున్నది (మత్తయి 7:12). అబార్షన్ జరిగించే డాక్టర్లు ప్రతిదినము ఘోరముగా శిశుహత్యలు జరిగించు చున్నారు

అబార్షన్ నరహత్యయే ఏలయ నగా అది కేవలము స్వార్థపరమైనది. నూటికి 93 శాతం జరిగే అబార్షన్లన్నియు కుటుంబ నియంత్రణ కొరకును అక్రమ సంబంధమును బట్టియు జరుగుచున్నవి.

### ముగింపు

“యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు. ఏడును ఆయనకు హేయములు. అవేవనగా అహంకార దృష్టియు, కల్లలాడు నాలుకయు, నిరపరాధులను చంపుచేతులును, దుర్యోచనలు యోచించు హృదయమును, కీడుచేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములను, లేనివాటిని వలుకు అబద్ధ సాక్షియు, అన్నదములలో జగడములు పుట్టించు వాడును” (సామె 6:16,17).

మానవుని ప్రాణము ప్రశస్తమైనదని మనము గుర్తించాలని దేవుడు కోరుచున్నారు. నిరపరాధ రక్తమును చిందించి చేసిన పాపమును గూర్చి మారుమనస్సు పొందిన యెడల దేవుడు క్షమించును, గాని వారి పాప పర్యవసానము ననుభవింప వలసి వచ్చును. బైబిలు లేఖకులలో ముగ్గురు నరుని రక్తము చిందించిన అపరాధులని నీకు తెలియునా? మోషే ఒక ఐగుప్తీయుని చంపాడు, దావీదు ఊరియాను చంపించాడు, సౌలు ఒకనొకప్పుడు అనేక క్రైస్తవులను చంపించాడు. దేవుడు వీరి అపరాధములను క్షమించి తన పనిలో గొప్పగా వాడు కొన్నారు.

గనుక యిదివరకు ఎక్కడున్నావో గాని ఇప్పుడు నీ పాదములు ఎక్కడ వున్నవి? మనందరము పాపము చేసిన వారమే (రోమా 3:23). అయితే దేవుడు మనలను క్షమించి మంచి వారిగా తయారు చేయును. అదియే శుభవార్త. నీవు యేసునందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు నొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన యెడల ఆయన నిన్ను రక్షించి తన పనిలో వాడుకొనును, ఇది గొప్ప ధన్యత!

- శ్యామ్ విల్‌కట్

# విశ్వాసము - మనుష్యుల ఆలోచనలు

విశ్వాసము కలుగువిధము- రోమా 10:17లో యివ్వబడినది విశ్వాసమునకు ఉదాహరణలు - హెబ్రీ 11వ అధ్యాయములో వున్నవి. మనుష్యుల ఆలోచనలకు, ఉద్దేశములకు, ఉదాహరణలు - ఆదికాండము 4వ అధ్యాయములో కయీను, 1 సమూయేలు 15:20-26లో సౌలు రాజును, రోమా 10:1-5లో యూదులును ఉదాహరణలుగా యున్నారు. ప్రస్తుత కాలములో మనుష్యుల ఆలోచనలకు ఉదాహరణలు : బాప్తిస్మము కొరకు చిలకరించుట - మతశాఖల పేర్లు ధరించుట - మనుష్యుల సిద్ధాంతములను అనుసరించుట- ఆరాధనలో మానవ నిర్మిత వాయిద్యములు ఉపయోగించుట - మనుష్యుల కల్పనచే వారి స్వంత పండుగ దినములను ఆచరించుట - క్రిస్మసు, లెంటు, ఈస్టరు మొదలగునవి (ప్రకటన 22:18-20).

2 యోహాను 1:9 చదువుము.

విశ్వాసమునకును మనుష్యుల ఆలోచనకును ఉన్న వ్యత్యాసము కొరకు తార్సువాడైన సౌలు యొక్క జీవితము ఒక ఉదాహరణ. తన స్వంత ఉద్దేశములతో నడిపించబడిన వాడై సంఘమును హింసించ మొదలు పెట్టెను. (అపో.కా. 8వ,9వ అధ్యాయములలో) ప్రభువు పిలుపునకు లోబడిన తరువాత, సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుటకు ఎన్నో శ్రమలను భరించెను. మొదట ఏ సంఘమునైతే హింసించినాడో ఆ సంఘ వ్యాప్తి కొరకే క్రీస్తునందు విశ్వాసముంచిన తరువాత తన ప్రాణము సహితము పెట్టెను. అవును క్రీస్తును గూర్చిన వాక్యము వినుట వలన విశ్వాసము వచ్చును. విశ్వాసమును కాపాడు కొనవలెను. మరణము వరకు నమ్మకముగా ఉండిన జీవకిరీటము వచ్చును. (2 తిమోతి 4:7, ప్రకటన 2:10).

బి. ఆనందరావు

గుడిపూడి - 6301403850

# పునరుత్థానుడైన క్రీస్తు

## ( Jesus Christ, the Resurrected )

ప్రతి ఆదివారము ప్రభువు బల్లను సమీపించి యేసుక్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానములను జ్ఞాపకము చేసికొనుట ఎంత ధన్యకర మో! "పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచు వాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నా యందు విశ్వాసముంచు ప్రతి వాడు ఎన్నటికిని చనిపోడు" అని యేసు చెప్పారు (యోహాను 11:25,26).

ఆధునిక సంఘటనలు కొన్ని మనం మరచిపోలేము. యుద్ధములు, భూకంపములు మొ॥నవి మన మనస్సు లో నిలిచిపోతాయి. ఆయా సంఘటన లు జరిగిన దినములను గూర్చి మనలో చాలామంది జ్ఞాపకముంచుకొంటాము. యేసుక్రీస్తు యొక్క మరణము కూడ అట్టిదే గాని, అంతకంటె ప్రాముఖ్యమై నది. ఆయన మరణించి మూడవ దినమున తిరిగి సజీవునిగా లేచారు! "సజీవుడైన వానిని మీరు ఎందుకు మృతులలో వెదుకుచున్నారు? ఆయన ఇక్కడ లేడు; ఆయన లేచి యున్నాడు!" (లూకా 24:5,6). యిది ఎంత శక్తి వంతమైన మాటయో!

మన ప్రియుల సమాధుల దగ్గర మనం నిలబడినప్పుడు ఒకానొకప్పుడు జీవించి చనిపోయిన వారి అస్థికలు ఆ సమాధిలో ఉన్నాయని మన మెరుగుదుము. అయితే యేసు యొక్క సమాధి దగ్గర మనం నిలబడితే, ఆయన సమాధి ఖాళీయని మనం గ్రహించ గలము. ఆయా మత గురువుల సమాధుల దగ్గరకు కొందరు యాత్రకు వెళ్లుదురు. వారి అస్థికలు ఇంకా ఆ సమాధులలో యున్నవని వారెరుగుదురు. అయితే క్రైస్తవులెవ్వరు క్రీస్తు సమాధిని దర్శించరు. ఆయన అక్కడ లేరు అని వారెరుగుదురు. ఆయన సమాధి ఖాళీయే. యేసును సమాధి చేయగా ఆయన శిష్యులు వచ్చి ఆయన శరీర మును ఎత్తికొనిపోదురేమోయని

కొందరు తలంచారు (మత్తయి 27:64 -66). అట్టిది సంభవించకుండునట్లు రోమీయులు ఆయన సమాధికి ముద్ర వేసి. సైనికులను కావలిగా యుంచిరి.

అయితే ఆయన సమాధి ఖాళీగా యున్నదని శిష్యులు గ్రహించగానే వారి ఉత్సాహము ఎంత గొప్పదో ఊహించ గలవా? ఆయన సమాధిని దర్శింప వచ్చిన స్త్రీలతో దూత, 'మీరు భయపడ కుడి, సిలువ వేయబడిన యేసును మీరు వెదుకుచున్నారని నాకు తెలియు ను. ఆయన ఇక్కడ లేడు; తాను చెప్పి నట్టే ఆయన లేచి యున్నాడు! రండి ప్రభువు పండుకొనిన స్థలము చూచి త్వరగా వెళ్లి ఆయన మృతులలో నుండి లేచియున్నాడని ఆయన శిష్యులకు తెలియజేయుడి'యని చెప్పెను (మత్తయి 28:6,7).

యేసు యొక్క పునరుత్థానము మన జీవితములను మార్చి వేసినది. అది మార్చుతునే యున్నది. పునరుత్థాన ము లేని యెడల మన జీవితమెట్లుండు నో 1 కొరింధీ 15:12-20 చెప్పు చున్నది. "క్రీస్తు లేపబడి యుండని యెడల మేము చేయు ప్రకటన వ్యర్థమే" యని పౌలు 14వ వచనములో చెప్పాడు. క్రీస్తు లేపబడని యెడల బోధింపవలసిన పనిలేదు, చదువ వలసిన పనిలేదు, లేఖనములను పఠింపనవుసరము లేదు. గాని ఆయన సమాధి ఖాళీ. అందువలన మనము బోధించాలి, పఠించాలి.

క్రీస్తు లేపబడని యెడల మేము అబద్ధ సాక్షులమవుదుము (15వ). ఇంకా మనం మన పాపముల లోనే ఉండి యుందుము (17వ). మన ప్రియులు ప్రభువునందు విశ్వాసులై మరణించారని తెలిస్తే అది ఎంత ఆదరణయో. క్రీస్తు తిరిగి లేపబడని యెడల వారికి అట్టి నిరీక్షణ యుండదు (18వ). గాని క్రీస్తు లేచారు! అదే మనకు గొప్ప నిరీక్షణ! ఎంత ఆనందమో! ఎంత గొప్ప దీవెనయో!

ఈ జీవితము మట్టుకే మన నిరీక్షణ యున్నట్లయితే మనము మనుష్యులందరి కంటే దౌర్భాగ్యులమై

యుందుము (19వ) గాని క్రీస్తు సమాధి నుండి తిరిగి లేచారు. ఖాళీ సమాధి మనకు నిరీక్షణ యిచ్చుచున్నది. సిలువ మరణము మహాఘోరమైన దైనను మన ప్రభువు మనకు బదులుగా మన స్థానములో తన ప్రాణమును మన కొరకు అర్పించినందుకు ఆయనకు కృతజ్ఞులమై యుండాలి. ఆయన పునరుత్థానము కొరకు, తద్వారా కలిగిన నిరీక్షణ కొరకు మనము కృతజ్ఞులమై యుండాలి.

క్రీస్తు పునరుత్థానమును గూర్చి ఎవ్విధమైన సంశయమును లేదు. ఆయన శత్రువులు ఆ వాస్తవమును నిరాకరించ లేకపోయారు. పునరుత్థానుడైన తరువాత అనేక మంది ఆయనను ప్రత్యక్షముగా చూచారు. మగ్ధలేనీ మరియ, అపొస్తులులు, 500 మందికి పైగా యున్న శిష్యులు, పౌలు అన బడిన సౌలు మొదలగు వారు ఆయనను ప్రత్యక్షముగా చూచారు (యోహాను 20).

క్రీస్తు ద్వారానే మనకు మరణము పై విజయము లభిస్తొది. యేసు వాగ్దానము చేసిన దానినంతటిని పునరుత్థానము మనకు పునరుద్ఘాటించు చున్నది (యోహాను 10:10). పునరుత్థానము ఈ జీవితంలోను రాబోవు జీవితంలోను ప్రయోజన కరము!.

యేసు మనకు చేసినదాని సంతటిని గూర్చి ఎన్నడైనా ఆలోచించావా? ఆయన ఒక మానవునిగా జీవించుటకు ఈలోకానికి వచ్చారు. భూమి పై ఆయన జీవితం సుఖమయం కాదు. ఆయన బీదవాని గా జన్మించారు. ఆయన ద్వేషించ బడ్డారు. ఆయన స్వకీయులే ఆయనను నిరాకరించారు. జనసమూహములు ఆయనను సిలువ వేయుడి, సిలుప వేయుడియని గగ్గోలు పెట్టారు. ఆయన పడిన హింసలన్నీ ఒకసారి గమనించుము.

యేసు ఎన్నడు ఈ భూమికి రాలేనట్లును, ఎన్నడు శ్రమ పడ నట్లును ఎన్నడు మన కొరకు

మరణించనట్లును కొందరు జీవిస్తారు. క్రీస్తు జీవితంలోని సంఘటనలను మనం ఎన్నడు చులకన చేయరాదు. మనం క్రీస్తు కొరకు జీవించుటకు ఎన్నడు ప్రయత్నించని యెడల, ఆయన మరణ సమాధి పునరుత్థానములు వ్యర్థమే.

"నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము" అని అపో.పౌలు చెప్పాడు (ఫిలిప్పీ 1:21). క్రీస్తు యొక్క పునరుత్థానమును బట్టి పౌలు అట్లు చెప్పగలిగాడు. మనమును అట్లు చెప్ప గలమా? క్రీస్తు పునరుత్థానము వలన మనమును అట్టి నిరీక్షణను కలిగి యుండగలము. మనలను మనమే పరీక్షించుకొందాము. "నా జీవితం దేవునికి ప్రీతికరముగా యున్నదా?" యని ప్రశ్నించు కొందాము., ఆయన మరణ సమాధి పునరుత్థానములకు అనుగుణంగా మనము నడుచు కొందుము గాక!

**- హేరీ గాస్**


**క్రీస్తు సంఘములు సమర్పించు**

**సత్యవాణి టి.వి. ప్రసారములు**

**ప్రతి ఆదివారం సాయంత్రం 6.00 గం॥లకు శుభవార్త**

**ప్రతి బుధవారం సాయంత్రం 6.30 ని॥లకు రక్షణ**

**ప్రతి రోజు ఉదయం 7.30 ని॥లకు**

**ప్రతి రోజు మధ్యాహ్నం 3.30 ని॥లకు కాంతి ఛానల్‌లో వీక్షించండి.**

**YOU TUBE లో**

**సత్యవాణి కార్యక్రమములను 24 గంటలు చూడండి**

**Satyavanicoc.kkd అని క్లిక్ చేయండి**

# సంక్షిప్త వార్తలు

సత్యవాక్కు 40 సం॥లు పూర్తిచేసికొని 41వ సం॥లో ప్రవేశించిన సందర్భము పురస్కరించుకొని అనేకులు మా ఆఫీసుకు ఫోన్ చేసి తమ శుభాభివందనములు తెలియజేసారు. కొందరు ఉత్తరాలు వ్రాసి తమ సంతోషాన్ని ఆత్మీయానుభవాన్ని తెలియజేసారు. అట్టివారందరికీ మా హృదయపూర్వక ధన్యవాదములు. మాకు వచ్చిన ఉత్తరాలలో రేపల్లె నుండి ఒకాయన వ్రాసిన మచ్చు తునక :

"ప్రభువునందు ప్రియులైన ప్రచురణకర్తలకు నా హృదయపూర్వక వందనములు. నేను నాయవ్వన దశ నుండియు మీ ద్వారా ఆత్మీయముగా అభివృద్ధిపొందినవాడను. ఈ రోజు సత్యవాక్కు నా దృష్టి ఆకర్షించినది. మీ 41వ సం॥లలో నేను కూడ వున్నానని తెలియపరచుచున్నాను. క్రైస్తవ పత్రికలు ప్రచురించు ప్రతివారు తమ పత్రిక భాగస్థుల వివరములు మొదటిపేజీలోనే చూపుటకద్దు. అయితే ఈ రోజు కూడ నాకందిన సత్యవాక్కు పత్రికలో అట్టిది యేమీలేదు. మీ కుటుంబమును ప్రభువు ఏర్పాటు చేసికొని పాపములో పడి కొట్టిమిట్టాడుచున్న కుటుంబాలను దైవసన్నిధికి నడిపించే విధముగా ప్రభువు మిమ్మును వాడుకొనుచున్నారు. మీరు, మీకుమారులు టి.వి. ద్వారా ప్రసారము చేయుచున్న శుభవర్తమానములు ఎంతో ప్రాధాన్యము కలిగియున్నది". సహో. జి. ఆశీర్వాదము గారికి అట్టి అనేకులకు మా హృదయపూర్వక వందనములు.

2019 ఆగష్టు 8,9,10 తేదీలలో కాకినాడ సత్యవాణి క్రీస్తుసంఘ ప్రాంగణలో **"బాలకుల నుండి పాలకులయ్యే వరకు" (Lads to Leaders)** అనే యౌవనస్థుల కార్యక్రమము అత్యంత ఘనముగా జరిగినది. మొదటి రోజున 800 మందితో ప్రారంభమై, తదుపరి 1500 మంది యువకుల వరకు ఆ సంఖ్య పెరిగినది. ఇంతమంది క్రీస్తు సంఘ బాలబాలికలు ఒకేచోట మూడురోజులు కలిసి మెలిసి ఒకరితోనొకరు సహవాసము, స్నేహము పెంచుకొనుట ఒక ప్రసిద్ధమైన ఘట్టము.

హాజరైన వారినుద్దేశించి యువతీ యువకులకు ప్రయోజనకరమైన ఆత్మీయ సందేశములను పలువురు సువార్తికులు అందించిరి. అట్టివారిలో చెన్నై నుండి వచ్చిన సహో.గంధం శ్యామ్‌సుందర్ గారు ముఖ్యులు. మరియు జి.డి.వి.కె. ప్రసాద్ గారు, వి. రాజావిజయ్‌కుమార్, బి.జాన్‌రత్నం, టి.జ్ఞాన సుధీర్, యన్.జాన్ ఆనంద బాబు, ఆశోక్ గార్లు, తదితర్లు చక్కటి వాక్యపరిచర్యచేసిరి.

హాజరైన యువతీయువకులను వివిధ తరగతులుగా విభజించి, కంఠత వాక్యములు, క్రైస్తవపాటలు, నాటికలు, డ్రాయింగు మొదలగు వాటిలో పోటీలు నిర్వహించగా విజేతలకు విలువైన బహుమతులు అందజేయబడినవి. ఒక యువకుడు 400పైగా లేఖన భాగములను కంఠోపాఠముగా వల్లించగా అతనికి ఒక లాప్‌టాప్ బహుమతి ఇయ్యబడెను. 1500 మందికి L2 L టీషర్టులు, కేప్‌లు, పెన్నులు మొ॥నవి ఉచితముగా అందజేయబడెను. అనేకచోట్లనున్న స్థానిక సంఘములు తమ యువకులను ఈ కార్యక్రమములో భాగస్థులుగా చేసిరి. అట్టివారందరికీ మా హృదయపూర్వక ధన్యవాదములు. ఈ కార్యక్రమములో అమెరికాలో L2 L డైరక్టర్ అయిన రోయ్‌జాన్సన్ గారు పాల్గొనుట ముదావహము. ఆయనతో కూడ గేరీ జాన్సన్, జిమ్‌క్రిస్వాల్, జెఫ్‌గిలిలాండ్ తదితరులు కూడా హాజరైరి. సమస్తము సక్రమముగా నిర్వర్తింప జేసిన మహాదేవునికి మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

**RIN Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2018-2020**

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533001

Date of Publication : 9th of Every Month
Date of Posting : 15th of Every Month

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004